## వైద్య సేవలో నర్సులది కీలక పాత్ర

### భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఉద్యోగోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : రోగులకు వైద్య సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బందిది కీలక పాత్ర అని, వారి సేవలు మరువలేనివని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాల్‌లో ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1, గ్రేడ్-2, హెడ్ నర్సుల అభినందన సభ సోమవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో పని ఒత్తిడితో రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ.. రోగికి, వైద్యునికి మధ్య అనుసంధానంగా సేవలందిస్తూ కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. వృత్తిలో భాగంగా వారికి ఎలాంటి సమస్యలున్నా తనకు చెప్పుకోవచ్చని వారికి భరోసా కల్పించారు.

**విత్తన క్షేత్రాన్ని సందర్శించిన కలెక్టర్**

సుజాతనగర్‌లోని రవి విత్తన క్షేత్రాన్ని సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. విత్తన క్షేత్ర రైతు మన్నేపల్లి రవి, ఆయన కుమారుడైన సైంటిస్ట్ హర్షతో మాట్లాడారు. ఇరగ కాసిన మిర్చి పంటను పరిశీలించారు.

**స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం**

భద్రాచలం, జనవరి 6: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కళాశాల, లయన్స్‌క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఎన్ఆర్ వాసవీ అసోసియేషన్, సికింద్రాబాద్ యూఎస్ఏ పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్సా శిబిరం సోమవారం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరై స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన సేవలు అభినందనీయమని కొనియాడారు.

**కిన్నెరసాని గ్రామంలో కలెక్టర్ పర్యటన**

పాల్వంచ రూరల్, జనవరి 6: మండలంలోని కిన్నెరసాని గ్రామంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం రాత్రి పర్యటించారు. ముక్కోటి ఉత్సవాల కోసం భద్రాచలం వచ్చిన భక్తులు.. కిన్నెరసాని సందర్శించే అవకాశం ఉన్నందున ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

## ఎమ్మెల్యేను కలిసిన క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు

మణుగూరు టౌన్, జనవరి 6: మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్‌లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరు మండల యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ దేవుని సేవకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సంఘాలకు చెందిన వివాహ వేడుకలు, శుభకార్యాలు, సభలు ఏర్పాటు చేసుకునేందుకు ఫంక్షన్‌హాల్ లేక ఇబ్బందులు పడుతున్నామని, క్రైస్తవ భవన్‌కోసం స్థలం ఇప్పించాలని కోరారు.

## లక్ష్యాల సాధనలో భాగస్వామ్యం కావాలి

మణుగూరు టౌన్, జనవరి 6: రక్షణ, క్రమశిక్షణతో పనిచేస్తూ నిర్దేశించిన లక్ష్యాలు సాధనలో కొత్త ఆపరేటర్లు భాగస్వామ్యం వహించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి అన్నారు. మణుగూరు ఏరియాకు నిర్దేశించిన 127 లక్షల 60 వేల టన్నుల ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్య సాధన కోసం, కొత్తగా వచ్చిన ఆపరేటర్ ట్రైనీలు విధులు నిర్వహించే క్రమంలో రక్షణకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి విధులు నిర్వహించాలని చెప్పారు. 146 బ్యాచ్‌కు చెందిన 28 మంది ఆపరేటర్ ట్రైనీలు రామగుండం ఏరియాలోని వీటీసీ శిక్షణ పూర్తి చేసుకొని సోమవారం వచ్చి రిపోర్టు చేశారు. వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ముకేష్, బంగారి పవన్‌కుమార్, మురళీ కృష్ణ, వినయ్‌కుమార్, శ్రీనివాస్, ఆపరేటర్ల పాల్గొన్నారు.

## నారచీరల ప్రదేశంలో ఏర్పాట్లు

నారచీరల ప్రదేశంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

దుమ్ముగూడెం, జనవరి 6: ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా పర్ణశాల ఆలయంలోని నారచీరల ప్రదేశం వద్ద ఆలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ఈ ప్రాంతంలో ముక్కోటి సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ఎలాంటి తొక్కిసలాటలు జరుగకుండా తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. నారచీరల ప్రదేశంలోని చుట్టూ కంచెను చేయించి బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్నారు.

## మిర్చి, మొక్కజొన్న పంటల పరిశీలన

టేకులపల్లి, జనవరి 6: మండలంలోని వివిధ గ్రామాల్లో మిర్చి, మొక్కజొన్న పంటలను ఇల్లెందు ఏడీఏ జి.లాల్‌చంద్ సోమవారం పరిశీలించారు. సస్య రక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఏవో అన్నపూర్ణ, ఏఈవో శ్రావణి పాల్గొన్నారు.

## అశ్వారావుపేట అభివృద్ధే లక్ష్యం

అశ్వారావుపేట రూరల్/అశ్వారావుపేట టౌన్, జనవరి 6: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మద్దికొండ, నారంవారిగూడెం కాలనీ, అశ్వారావుపేట, అల్లిగూడెం పంచాయతీ కార్యాలయాలను, కొత్త నారంవారిగూడెం స్కూల్ ప్రహరీని సోమవారం ప్రారంభించారు. సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## పాల్వంచ విద్యార్థినుల ప్రతిభ

పాల్వంచ రూరల్, జనవరి 6: ఖమ్మంలో ఈ నెల 4న జరిగిన యూత్ ఫెస్టివల్‌లో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించారు. డి.అనూష- రంగోలిలో మొదటి బహుమతి, బి.రూప- పెయింటింగ్‌లో రెండో బహుమతి, సిహెచ్.సునంద- వ్యాస రచనలో తృతీయ బహుమతి సాధించారు. వీరిని సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కామేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి అభినందించారు.

## ప్రగతివనం పార్క్ సందర్శన

రామవరం, జనవరి 6: రుద్రంపూర్‌లోని ప్రగతివనం పార్క్, చెరువు, బతుకమ్మ ఘాట్, ట్యాంక్‌బండ్, ఆర్చ్ నిర్మాణ స్థలం, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను సింగరేణి ఏరియా జీఎం శాలెంరాజు సోమవారం సందర్శించారు. ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, ఇన్‌చార్జ్ టి.శ్రీకాంత్, డీజీఎం శివకేశవరావు, జీకే వోసీ పీవో శ్రీరమేష్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# రూ.15 వేల రైతుభరోసా ఇవ్వాల్సిందే..

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని సహించం
ఎకరానికి రూ.12 వేలను ఒప్పుకోం
జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
కదిలి వచ్చి ధర్నాల్లో పాల్గొన్న అన్నదాతలు

మణుగూరు : నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పినపాక : మాట్లాడుతున్న నాయకులు

వినతిపత్రం ఇస్తున్న లక్కినేని సురేందర్‌రావు, వరప్రసాద్ గౌడ్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు మాత్రమే ఇస్తూ రైతులకు ముష్టివేస్తోందంటూ విమర్శించిన రేవంత్‌రెడ్డి.. తాము అధికారంలోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ ప్రగల్భాలు పలికారని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారం చేపట్టిన ఏడాది తరువాత రైతుభరోసా కింద ఏటా ఎకరానికి రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మోసం చేశారంటూ మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.15 వేలు ఇవ్వాల్సిందేనంటూ డిమాండ్ చేశారు. అప్పటి వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు కలిసి సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. అన్ని మండలాల్లోనూ ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కొన్ని మండలాల్లో రాస్తారోకోలో, నిరసన ర్యాలీలు చేపట్టారు.

– నమస్తే నెట్‌వర్క్

# రోడ్డు భద్రతపై అవగాహన

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

భద్రాచలం, జనవరి 6: భద్రాచలం మోటార్ వెహికల్ యూనిట్ కార్యాలయంలో ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా యూనిట్ కార్యాలయానికి వాహన రిజిస్ట్రేషన్లు, లైసెన్స్ తదితర పనులపై వచ్చిన వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులు వాహనం నడిపేటప్పుడు మూలమలుపులు, క్రాస్ రోడ్‌లు, ఇరుకు వంతెనలు ఓవర్‌టేక్ చేసేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు.

కొత్తగూడెం క్రైం, జనవరి 6: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు పట్టణంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ధ్రువ పత్రాలు లేని వాహనాలను, హెల్మెట్ లేని వాహనదారులను ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేష్ నిలిపివేశారు. అక్కడకు వచ్చిన కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్.. వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకే రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

దుమ్ముగూడెం, జనవరి 6: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని దుమ్ముగూడెం సీఐ అశోక్ అన్నారు. మండల కేంద్రమైన లక్ష్మీనగరం సెంటర్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ అన్ని పత్రాలు కలిగి ఉండాలన్నారు.

జూలూరుపాడు, జనవరి 6: రోడ్డు భద్రత నియమాలను వాహన చోదకులు పాటించడం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండాలని సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా స్థానిక చండ్రుగొండ క్రాస్ రోడ్ వద్ద డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు.

# విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

జూనియర్ కళాశాల సిబ్బందికి సూచనలు చేస్తున్న ఇంటర్ బోర్డు అధికారి

పినపాక, జనవరి 6: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని ప్రభుత్వ ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక అధికారి యాదగిరి అన్నారు. ఆయన సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. కళాశాలలో డ్రాపౌట్ స్టూడెంట్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో సంసిద్ధులను చేయాలని సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కళాశాలలోని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఐఈవో వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శన**

బూర్గంపహాడ్, జనవరి 6: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ బోర్డు రాష్ట్ర తనిఖీ సభ్యులు యాదగిరి, ఇంటర్ విద్యాధికారి హెచ్.వెంకటేశ్వరరావు సోమవారం సందర్శించారు. కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం, ప్రగతి నివేదికలు పరిశీలించి ప్రిన్సిపాల్ చిన్నా, అధ్యాపక సిబ్బందిని అభినందించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి అధ్యాపకుల బోధనావిధానం అర్థమవుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. సిలబస్ పూర్తిచేశారా.. లేదా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో విద్యావిధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవో అధ్యాపకులు శ్రీనివాస్, సత్యేంద్రకుమార్, కొండా ముకుందం, మూర్తి, నరేష్, సాహితీ, జరీనాభాను, శివ, లక్ష్మీదీపిక, దివ్య, రమేష్, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మందుపాతర పేలి 9 మంది జవాన్లు మృతి

ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు
మావోయిస్టుల విముక్తి రాష్ట్రం చేస్తాం : డిప్యూటీ సీఎం

మందుపాతర పేలడంతో ఏర్పడిన గొయ్యి

కొత్తగూడెం క్రైం, జనవరి 6 : అభయారణ్యం యుద్ధభూమిగా మారింది. మావోయిస్టులు విసిరిన పంజాకు అడవి హడలిపోయింది. మావోయిస్టులు పేల్చిన ఐఈడీ తొమ్మిది మంది జవాన్లను బలితీసుకుంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీజాపూర్ జిల్లాలో డీఆర్‌జీ భద్రతా దళాలు పఖంజూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్స్ ముగించుకుని తమ వాహనంలో వెనుదిరిగాయి. ఈ క్రమంలో కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేలి గ్రామ సమీపంలోకి వాహనం చేరుకోగానే అక్కడ మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి భారీ విస్ఫోటనం చెందింది. దీంతో జవాన్లు వస్తున్న వాహనం ఒక్కసారిగా గాల్లోకి ఎగిరి పక్కనే ఉన్న చెట్లపై ముక్కలుగా పడింది. అందులో ఉన్న డ్రైవర్‌తోపాటు 8 మంది జవాన్ల మాంసపు ముద్దలు చెల్లాచెదురుగా పడిపోయాయి. మరికొందరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న భద్రతా దళాలు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. సుమారు ఆరు వాహనాల్లో పడంతో దండకారణ్యంలో యుద్ధమేఘాలు అలుముకున్నాయి.

**మావోయిస్టు విముక్తి రాష్ట్రంగా మారుస్తాం..**
**ఉప ముఖ్యమంత్రి అరుణ్ సావో**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని త్వరలోనే మావోయిస్టు విముక్తి రాష్ట్రంగా మారుస్తాం. మావోయిస్టులు ఇలాంటి విధ్వంసక చర్యలకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నేరుగా ఎదుర్కోలేకనే మావోయిస్టులు ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు త్వరలోనే మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేస్తాం.

## రామావతారుడిగా..

రామావతారంలో భద్రాద్రి రాముడు

భద్రాచలం, జనవరి 6: ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఏడో రోజు సోమవారం భద్రాచలం సీతారామచంద్ర స్వామి నిజరూప దర్శనమైన రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని ఆలయంలో రామావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిత్య కల్యాణ మండపానికి తీసుకొచ్చి పూజలు చేసిన తర్వాత వేదపండితులు స్వామివారికి వేద విన్నపాలు సమర్పించారు. ఆ తర్వాత మిథిలా స్టేడియానికి మేళతాళాల నడుమ స్వామివారిని ఊరేగింపుగా తీసుకొస్తుండగా మహిళలు అగ్రభాగాన కోలాటాలు వేసి భక్తిభావాన్ని చాటుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం నిజరూపంలో ఉన్న రామయ్యను దర్శించుకుని పులకించిపోయారు.

**నేడు బలరామావతారం..**

ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా 8వ రోజు మంగళవారం భద్రాచలం సీతారామచంద్రస్వామి బలరామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధును కలిసిన బీఆర్ఎస్ నేతలు

ఎమ్మెల్సీ మధును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ మండల నాయకులు

భద్రాచలం, జనవరి 6: బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధును భద్రాచలం మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు అయినాల రామకృష్ణ, బీసీ సెల్ నాయకులు సాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతన మండలి సభ్యుడిగా 'పిచ్చిరెడ్డి'

బూర్గంపహాడ్, జనవరి 6: రాష్ట్ర కనీస వేతన సలహామండలి(మినిమమ్ వేజ్ అడ్వైజరీ బోర్డు) సభ్యుడిగా సారపాక ఐటీసీ పేపరు బోర్డులో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ యారం పిచ్చిరెడ్డి ఎన్నికైన విషయం తెలిసిందే. సోమవారం హైదరాబాద్‌లోని సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ సమక్షంలో సలహా మండలి సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంఘాల ప్రతినిధిగా తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించినందుకు కార్మిక సమస్యలపై పోరాడి వారికి ఎలాంటి కష్టం రానివ్వనన్నారు. ఐటీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయానికి కృషి చేస్తానన్నారు.

## ఊరచెరువు అభివృద్ధికి అనుమతులు ఇవ్వండి

బూర్గంపహాడ్, జనవరి 6: మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఊరచెరువును రూ.30లక్షలతో అభివృద్ధి చేయాలని, మినీట్యాంక్‌గా రూపొందించాలని సంకల్పించినట్లు రోటరీ క్లబ్ తాజా మాజీ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ముజాహిద్‌ను కలిసి ప్రభుత్వపరంగా అన్ని అనుమతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రోటరీక్లబ్ ఆఫ్ గ్లోబల్ విసార్ట్స్ అధ్యక్షులు నంబూరి వెంకటరాజు, సురేన్ పోరూరి ఉన్నారు.

## మర్కోడు ఎంపీపీఎస్ పనులు పునఃప్రారంభించండి

ఆళ్ళపల్లి, జనవరి 6: మండల పరిధిలోని మర్కోడు పంచాయతీ ఎంపీపీఎస్ పనులు పునఃప్రారంభించాలని హెచ్ఎం రామకృష్ణ సోమవారం ప్రజావాణిలో జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2023 ఏప్రిల్‌లో మన ఊరు-మన బడి ప్రణాళికలో ఎంపికై శిథిలావస్థలో ఉన్న ఆ పాఠశాలను కూల్చి వేశారు. ఈ పనులు పిల్లర్ల వరకు రాగానే ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయని, దీంతో పాత శిథిలావస్థలో పక్కనే ఉన్న రెండు గదుల్లో పాఠాలు బోధిస్తూ విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నదని, పనులు ప్రారంభించాలని వేడుకున్నారు.

## ఓటర్ల జాబితా విడుదల

మణుగూరు టౌన్, జనవరి 6: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పినపాక నియోజకవర్గంలోని 245 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఫైనల్ ఓటర్ల జాబితాను అన్ని పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 1,00,279 మంది పురుష ఓటర్లు, 1,04,694 మంది మహిళా ఓటర్లు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు కలిపి మొత్తం 2,04,978 మంది ఓటర్లు ఉన్నారు.

## కోడి కత్తులు విక్రయిస్తున్న ఇద్దరు బైండోవర్

దుమ్ముగూడెం, జనవరి 6: కోడిపందాల నిర్వహణలో భాగంగా కోడి కత్తులు తయారుచేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను దుమ్ముగూడెం పోలీసులు సోమవారం తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఆర్లగూడేనికి చెందిన కారం చలపతి, కారం కన్నప్పరాజు ఇంటి వద్ద కోడి పందాల ఆటకు వినియోగించే కోడి కత్తులు తయారు చేస్తుండగా వారి వద్ద 15 కోడి కత్తులు స్వాధీనం చేసుకుని దుమ్ముగూడెం పోలీసులు అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

## చదరంగం విజేతగా జాహ్నవి

దమ్మపేట, జనవరి 6: సత్తుపల్లిలోని సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన చదరంగం పోటీల్లో పది మందిని విజేతలుగా నిర్వాహకులు ప్రకటించారు. వీరిలో మండలంలోని రంగువారిగూడెం గ్రామానికి చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని పల్లెల జాహ్నవి ఉంది. ఆమెను ఉపాధ్యాయులు అభినందించారు.

## అప్రమత్తంగా ఉండాలి

అన్నపురెడ్డిపల్లి, జనవరి 6: చైనాలో హ్యూమన్ మెటన్యూమో వైరస్ విస్తరిస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో కోరారు. కరోనా రోజుల్లో మాదిరిగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రగ్గులు పంపిణీ

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 6: చలి తీవ్రత నేపథ్యంలో స్థానిక పెద్ద బజార్‌లోని వృద్ధులకు రగ్గులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుష్పాల చంద్రరావు సోమవారం పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు పుష్పాల వెంకన్న, హనుమంతరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జూదరులు అరెస్ట్

అశ్వారావుపేట, జనవరి 6: మండలంలోని ఊట్లపల్లిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని ఎస్సై యయాతి రాజు సోమవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.1,500, మూడు సెల్ ఫోన్లు స్వాధీనపర్చుకున్నారు. మరో నలుగురు పరారయ్యారు. కేసు నమోదు చేశారు.

## ఎమ్మెల్యేకు సన్మానం

చుంచుపల్లి, జనవరి 6: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేశారంటూ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్ సోమవారం సన్మానించారు. మున్సిపల్ కౌన్సిల్ కో ఆప్షన్ మెంబర్ ఎండీ యాకూబ్‌పాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి సాయం

ఇల్లెందు, జనవరి 6: స్థానిక స్టేషన్ బస్తీకి చెందిన యుద్ధమూరి వెంకటేశ్వర్లు ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని బాల్య స్నేహితులు సోమవారం పరామర్శించారు. అతడి కుమార్తె పేరు మీద రూ.20వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, బాండ్ పేపర్‌ను అందజేశారు. ముద్దుల సునీల్, నారాయణ, కిషన్, కుమారస్వామి, అశోక్, జానీపాషా, కవిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

## ట్రక్ ఆపరేటర్ శిక్షణకు ఆహ్వానం

ఇల్లెందు రూరల్, జనవరి 6: సింగరేణి ఇల్లెందు ఏరియాలో వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జీఎం వి.కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉపరితల గనుల ప్రాంతాలకు చెందిన యువకులు, భూనిర్వాసితులు, వారి సంతానం (యువకులు) అర్హులని పేర్కొన్నారు. కనీసం 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, వయసు 18-35 సంవత్సరాల మధ్య ఉండాలని, హెవీ గూడ్స్ వెహికిల్ డ్రైవింగ్‌లో మూడేళ్ల అనుభవం ఉండాలని వివరించారు. తగిన ధ్రువపత్రాలతో ఎంవీటీసీ కార్యాలయంలో ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి, జనవరి 6: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో ఐదోతరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అన్నపురెడ్డిపల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు రూ.100 పరీక్ష ఫీజు